

# భవానీద్వీపం

## – వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 50 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

పాఠకుడా! నాకు అంతా ముందే తెలుసు! అంతా నేను అనుకున్నట్టే జరిగింది, జరుగుతున్నది, ముందు ముందు జరుగుతుంది. నువ్వొక పిచ్చివాడివి! పిరికివాడివి! అవివేకివి! జరిగింది, జరుగుతున్నది కూడా నీకు తెలియదు. చెప్పుడు కథలు విని తుప్పు పట్టిన చెవులు నీవి. కాలసాగరంలో ఎగిరి, విరిగి పడిన అలలెన్నో! ఆ గలగలలను విన్న చెవులు నావి! ఆ కదలికలను కన్న కనులు నావి! యిప్పటికీ పదిలంగా నా స్మృతిలో మిగిలున్న గాథలు యివి! గాథలా? ఊహూ. కాదు! చరిత్ర యిది!

పురిటికందుగా సంతూరును వదిలిపెట్టిన బాలుడు పాతిక సంవత్సరాల తర్వాత, సరిగ్గా పన్నెండు సంవత్సరాల క్రితం, మరలా సంతూరును చేరుకున్నాడు. పాతికేళ్ళ క్రితం పాడుబడ్డ బావిలోనుండి అతడిని బయటకు తీసి, సింహాచలానికి చేర్చిన బైరాగి వెంట వచ్చాడు. ఆలంపూరునుండి వెళ్ళిన మేనమామ అల్లుడిని కనిపెట్టి, ఇంటికి పట్టుకొచ్చాడు.

పాతికేళ్ళక్రితం పరమపదించిన శఠగోపాచార్యులు పల్లకీ దిగి వస్తున్నాడని భయంతో పరుగులు పెట్టారు కొందరు. ఆ అందానికీ, వర్ఛస్సుకూ మైమరిచి నోళ్ళు వెళ్ళబెట్టి చూశారు కొందరు. తీర్థ యాత్రలనుండి తిరిగొచ్చిన పార్థుడిలా వున్నాడని పాదాలపై పడ్డారు యింకొందరు. కృష్ణమాచార్యుల తల్లిదండ్రులు ఆనందంతో మూడు సార్లు మూర్ఛపోయారు. బైరాగి వారిని తెరుకునేట్టు చేశాడు. కృష్ణమాచార్యుల నాయనమ్మ

ఆనందంతోనో, పశ్చాత్తాపంతోనో బైరాగి కాళ్ళమీదపడి వదలలేదు. పొంగి పొంగి పారిన కృష్ణమ్మలా ఆమె కన్నీరు కారింది. వ్యతీపాత యోగంలో, చెడు నక్షత్రంలో, గుడ్డివాడిగా పుట్టి, పాడుబడ్డ బావిలో విసిరివేయబడ్డ బాలుడు, గాన గంధర్వుడై, రూపంలో మన్మథుడై తిరిగొచ్చాడు. అతడి తల్లి దండ్రులకు అతడిని వదిలించుకున్న రెండేళ్ళ తరువాత మరొక కుమారుడు కలిగాడు. వాడు కూడా అన్నను కౌగలించుకుని ఆనందంతో నిశ్చేష్టుడై పోయాడు.

చుట్టుపక్కల పరగణాలకు కార్చిచ్చులా పాకింది ఆ వార్త. ఆనోటా ఆనోటా కాకతీయ ప్రభువుల చెవుల బడ్డది. ప్రభువులు మేనా పంపించి మరీ సాదరంగా కృష్ణమాచార్యులను ఓరుగల్లు పిలిపించుకున్నారు. వారం రోజులపాటు ఓరుగల్లు కృష్ణమాచార్యుల గానప్రవాహంలో ఓలలాడింది. సంవత్సరం కూడా తిరక్కుండానే కాకతీయ ప్రభువులకు ఆధ్యాత్మిక గురుతుల్యుడైనాడు కృష్ణమాచార్యులు. సంతూరుతో సహా యాభై గ్రామాలను కృష్ణమాచార్యులకు దానం చేశాడు కాకతీయ ప్రభువు. మరొక యాభై గ్రామాలకు అధికారిగా నియమించినట్లు శాసనం జారీ చేశాడు.

తన కోరికను చెల్లించుకున్నాడు కృష్ణమాచార్యుల మేనమామ. మేనల్లుడికి తన బిడ్డను యిచ్చి పెళ్ళి చేశాడు. ఎంతమంది అవునన్నా, కాదన్నా, ఒప్పుకోకున్నా ఆలంపూరుకూ, సంతూరుకూ రెండో తరంలో కూడా వియ్యం కుదిరింది! కాకతీయ ప్రభువులు స్వయంగా ముఖ్య అతిథిగా విచ్చేశాడు. పాతకమూరు భాగవతులు ఆ పదహారు రోజుల పెళ్ళిలో ప్రతిరోజూ గజ్జెకట్టి, చిందులేసి కనులకు విందు చేశారు.

అమ్మాయిని అప్పగింతలు పెట్టి సాగనంపే సమయంలో ఒక బాలుడిపై నారసింహుడు పూనాడు! అల్లకల్లోలం చేశాడు. పాతికమంది మీదపడి పట్టుకున్నా పూచికపుల్లలను విదిలించినట్లు విదిలించి పారేశాడు. 'నాకు యిచ్చిన మాట మరిచావారా? నాలుగులక్షల పద కైంకర్యం నాకేదిరా? అని గర్జనలు చేశాడు. కృష్ణమాచార్యులు 'నాలుగులక్షల పదాలు పూర్తిచేసి శ్రీరంగం తీసుకొచ్చి సమర్పిస్తాను స్వామీ' అని గానం చేసి, ప్రమాణం చేశాడు. పాతకమూరు సోదరులు హారతులు పట్టారు.

అప్పుడు బాలుడి ఒంటిమీద పూనిన నరసింహుడు శాంతించాడు. ప్రభువుల ప్రోత్సాహంతో తన నాలుగు లక్షల పదకవితా యజ్ఞాన్ని కొనసాగించాడు కృష్ణమాచార్యులు.

మనవడు తిరిగివచ్చిన రెండేళ్ళ తరువాత, తను పాడుబడ్డబావిలో పారేయించిన పెద్ద మనుమడి ఒడిలోనే ప్రాణాలు విడిచింది కృష్ణమాచార్యుల నాయనమ్మ. ఆ తర్వాత మూడు సంవత్సరాలకు నిద్రలో నాగుపాము కరిచి కృష్ణమాచార్యుల తల్లి మరణించింది. ఆ తరువాత నాలుగేళ్ళకు కోవెలలో కొలుపు చేసి వస్తూ, పిడుగుపడి, కృష్ణమాచార్యుల తండ్రి ప్రాణాలు వదిలాడు. అతడి తమ్ముడు స్త్రీ లోలుడై, భ్రష్టుడైనాడు.

★★★★★★★★★★★★★★★★★★

కోలాహలంగా అరుపులు, కేకలు పెడుతూ వురుకులు పరుగులమీద వూరవతలి మామిడి తోపుకు వచ్చిపడుతున్నారు ఊరు వూరంతా. వసంత ఋతువు కళకళలాడుతున్నది చిన్న వూరంత వున్న మామిడితోటలో. ఇంకొద్దిగా వంగితే నేలకు తాకుతాయేమో అన్నట్టు వంగి వున్నాయి మామిడి కొమ్మలు. గుమ్మడి కాయలంత మామిడి కాయలు ఆకులు, కొమ్మలు కనబడకుండా విరగ కాసి వున్నాయి. కింద రాలిన ఎండు కొమ్మలు విరుగుతున్న చప్పుడు, ఆకులూ అలములూ నలుగుతూన్న ధ్వనులు చెలరేగుతున్నాయి. అరుపులు కేకలతో గోల గోలగా కంచెను దూకుతూ, ఎగిరి గంతులు వేస్తూ వస్తున్నారు. పనులకు వెళ్ళి అప్పుడే యిళ్ళకు మళ్ళుతున్న శ్రామికులున్నారు. పల్లెలో కులవృత్తులు చేసుకునే అన్ని వర్ణాల వారు వున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా పడుతూ లేస్తూ పరుగులు పెడుతూ చేరుకున్నారు. చూస్తుండగానే తోట నిండిపోయింది ఊరి జనులతో.

తోట మధ్య ముచ్చటైన పర్ణశాల వున్నది. చుట్టూ దట్టంగా పెరిగిన మామిడి చెట్ల మధ్యన, మనసులో దాగిన మర్మంలా వున్నది. పాపిష్టివాడి మనసులో పాపకర్మలా వున్నది. తోటమధ్యలో వున్న గుడిసె ద్వారానికి వున్న వెదురు తడిక పూర్తిగా లోపలకు తెరుచుకుని వున్నది. ద్వారం బయట ఒకప్రక్కన మౌనంగా, గంభీరంగా చేతులు వెనుకకు కట్టుకుని ఎదురుగా వున్న వ్యక్తిని చూస్తున్నాడు కృష్ణమాచార్యులు. ఛాతీ మీదకు వ్రేల్లాడుతున్న గడ్డం సగానికిపైగా తెల్లబడి వున్నది. భుజాలమీదకు వ్రేలాడుతున్న నొక్కుల నొక్కుల జుత్తు వాగువడ్డున రెల్లుపొదలలాగా తెల్లగా మెరిసిపోతున్నది. సాయం సంధ్య సమీపిస్తున్న సూర్యుడిలా వెలిగిపోతున్నాడు కృష్ణమాచార్యులు.

ఎదురుగా చేతులు కట్టుకుని నల్లరాతి శిల్పంలా మెరిసిపోతున్నాడు గ్రామీణుడు ఒకడు. మొండిగా మెడ ఎగరేసి చూస్తున్నాడు. కసిగా కనులు తళతళ మెరుస్తున్నాయి. అతడి కాళ్ళమీద, అంగవస్త్రం మీద చిమ్మిన చిక్కని రక్తం యింకా పచ్చిగానే వున్నది. యిద్దరి మధ్యనా తెరిచివున్న ద్వారంగుండా లోపల భయంకరమైన దృశ్యం కనిపిస్తున్నది. వొంటి మీద వస్త్రాలు పూర్తిగా తొలిగిపోయినట్లు వున్నారు స్త్రీ పురుషులు ఇద్దరు. కామకేళిలో మునిగి, ప్రపంచాన్ని మరిచి, నిశ్చలంగా వున్నారు. పైన వున్న పురుషుడి వెన్నులోనుండి, క్రింద వున్న స్త్రీ గుండెలోనుండి నేల లోపలికి దిగిపోయిన గునపం పావు వంతు కనిపిస్తున్నది. చిమ్మిన నెత్తురు దాని అంచులనుండి యింకా కారుతూనే వున్నది చిక్కగా. నగ్నంగా వున్న స్త్రీ పురుషుల శరీరాలనుండి వరదలా పారిన రక్తం ద్వారం దాకా మడుగు కట్టింది. ఆవుపేడతో అలికిన నేల పీల్చుకున్నది పోను, పచ్చిగా కళ్ళు చెదిరేట్టు ఎర్రగా మెరుస్తున్నది, వరదలు కట్టిన నెత్తురు. ఇప్పుడిప్పుడే కొద్దిగా నలుపుకు తిరుగుతున్నది.

వందలమంది చుట్టూ చెట్లు కనిపించకుండా మూగారు. గుస గుసలు, గుండెచప్పుళ్ళు, తోటలో గాలులు కలిసిపోయిన వింత ధ్వని వినిపిస్తున్నది. జరగండి, జరగండి అని గుంపును చీల్చుకుంటూ వడి వడిగా ముందుకు వచ్చారు నలుగురు దృఢకయులు. గ్రామ రక్షక భటులు వాళ్ళు. ద్వారం వద్దకు చేరుకున్నారు. కృష్ణమాచార్యులకు నమస్కరించారు. ఎదురుగా వున్న వ్యక్తిని రెండుపక్కలా పెడరెక్కలు విరిచి పట్టుకున్నారు. ఒక్కసారి అలలాగా విసురుగా హుంకారం చెలరేగింది తోటలో. గుంపులో ముందున్న పది పదిహేను మంది ముందుకు దూకబోయారు. యిద్దరు రక్షకభటులు ఒరలనుంచి పొడవాటి ఖడ్గాలను సర్రున బయటకు లాగారు. రెండో చేతిలో వున్న బల్లాలను బలంగా నేలకు తాటించి సిద్ధంగా పట్టుకున్నారు. కృష్ణమాచార్యులు చూపులతోనే రక్షకభటులను వారించాడు. తలతిప్పి గుంపును ప్రశాంతంగా చూశాడు. ముందుకు వురకబోయిన ఆవేశపరులు ఆగిపోయారు.

'వదిలిపెట్టండి!' క్లుప్తంగా ఆదేశించాడు కృష్ణమాచార్యులు. రక్షకభటులు వారు పట్టుకున్న వ్యక్తిని వదిలిపెట్టి పక్కకు తప్పుకున్నారు. గుడిసె లోపల వెన్నులో గునపం దిగి ప్రాణాలు వదిలినవాడు కృష్ణమాచార్యుల సోదరుడు. అతడితో రతిలో, గుండెలో గునపం దిగి మరణించిన యువతి సంతూరు రజకుల కులపెద్ద కోడలు. వారిద్దరినీ భూమిలోకి అంట పాతినవాడు ఆ యువతి పెనిమిటి!

కృష్ణమాచార్యుల కనుసైగతో, ఆయనకు నమస్కరించి అక్కడనుండి వెళ్ళిపోయారు రక్షకభటులు. 'నా తమ్ముడు పతితుడై పడిపోయాడు. తన ప్రవర్తన కారణంగా బలవన్మరణం పాలైనాడు. ఎవరికి యేది ప్రాప్తమో వారికి అదే సంప్రాప్తము. చనిపోయినవారికి అంత్య క్రియలు చెయ్యాలి' అన్నాడు కృష్ణమాచార్యులు. చుట్టూ మూగిన వారిలో ఎవరూ పెదవులు మెదపలేదు. ముందుకు రాలేదు. అందరి కనులలో, కదలికలలో నిరసన, తిరస్కారం, జుగుప్స, ఆవేశం!

'మడేలా! పోదాం పా! పీనుగులు కుళ్ళి కుళ్ళి పోవాలి' భగ భగలాడే చింతనిప్పుల్లాంటి కళ్ళు పెద్దవి చేసి వురుములా పలికాడు ఒక నడివయసు వ్యక్తి. ఒక్కసారి కృష్ణమాచార్యుల కళ్ళలోకి చూసి తలదించుకున్నాడు యిద్దరినీ గునపతో అంటపొడిచిన పెనిమిటి. క్షణంపాటు సంశయంగా వూగిసలాడాడు. కదిలి గుంపుతో వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతున్నవారిని మౌనంగా ప్రశాంతంగా చూశాడు కృష్ణమాచార్యులు. 'నరసింహా!' అని బిగ్గరగా నామోచ్చారణ చేసి కనులు మూసుకున్నాడు. కొందరు వెనుకకు తిరిగి చూశారు. రెండు చేతులూ జోడించి కనులు మూసుకున్న కృష్ణమాచార్యులు వారికి కనిపించాడు. తెరిచే వున్న ద్వారంలోనుండి లోపల ఒళ్ళు గగురు పొడిచే దృశ్యం కనిపించింది.

వింటినుండి బాణంలాగా చివ్వున తనంత తనే పైకి లేచి దబ్బున పక్కకు పడిపోయింది గునపం. చిల్లి కుండలోనుంచి నీరు చిమ్మినట్టు రక్తం చిమ్మింది. ఆ చప్పుడుకు కనులు తెరిచి క్షణం పాటు శవాలవైపే రెప్పకొట్టకుండా చూశాడు కృష్ణమాచార్యులు. విసురుగా పక్కకు తిరిగి అడుగులేశాడు. భయంతో వణికిపోతూ, కిందా మీదా పడుతూ పక్కకు తప్పుకుని దారి యిచ్చారు గుంపుగా నడుస్తున్న జనం. సూటిగా చెట్ల మధ్యనుండి దూరంగా ఒక మూలకు నడిచాడు కృష్ణమాచార్యులు.

అప్పుడు జరిగిందా సన్నివేశం! పాఠకుడా!

భయంతో కీచుగా అరుస్తూ, ఆర్తనాదాలు చేస్తూ, వెనక్కు చూస్తూ పరుగులు పెట్టారు కొందరు. కిందపడి లేవను కూడా లేవకుండా దొర్లుతూ చెట్ల చాటుకు తప్పుకుని, వణుకుతూ గుడ్లప్పగించి చూశారు కొందరు. పిలిస్తే సరేనని వెంట నడిచే సేవకులలా, కంటికి కనిపించకుండా ఎవరో ఈడ్చుకు వెళ్తున్నట్టు కదిలాయి ఆ రెండు పీనుగలు. శరీరాలలో మిగిలిన నెత్తురు ఊటలా వుబుకుతుంటే దారి పొడుగునా నెత్తురు చిందిస్తూ

కృష్ణమాచార్యుల వెనుకే ఈడ్చినట్లు కదిలాయి. నేలమీది ఎండుటాకులు నెత్తుటి శరీరాలకు అతుక్కుని శవపూజ చేసిన ఎర్ర పూలలా అయినాయి. దుమ్ము, ధూళి, ఆకులు పక్కలకు చెదిరిపడేలా లాక్కువెళ్లినట్టు వెళ్లి కృష్ణమాచార్యుల వెనుకే ఆగిపోయాయి శవాలు రెండూ. కింద పడివున్న రెండు ఎండు పుల్లలను తీసుకున్నాడు కృష్ణమాచార్యులు. ఆ రెండు మృత కళేబరాలమీద వేశాడు. రెండు అడుగులు వెనక్కు వేశాడు. అంతే! కడవలకొద్దీ నేయి గుమ్మరించి నిప్పు అంటించినట్లు వాటంతటవే భగ్గున మండి పోయాయి శవాలు. చూస్తుండగానే చిర చిర చిరలాడుతూ కాలి బూడిదై పోయాయి. ఎక్కడివాళ్లు అక్కడే సాగిలబడి 'దండాలయ్యా!' 'తప్పు కాయవయ్యా!' అని వణుకుతూ ప్రాధేయపడసాగారు జనం.

'నా తమ్ముడు, నీ యింటిది తప్పు చేశారు. చేసిన తప్పుకు అనుభవించారు. మనుషులకే తప్పొప్పులు! శవాలకేముంటాయి, నిప్పులు తప్ప!' పెద్దగా ఏడుస్తూ తన కాళ్ళముందు పడిపోయిన పెనిమిటిని చూస్తూ అన్నాడు కృష్ణమాచార్యులు, వూరుబయటకు ఏటివైపు అడుగులేస్తూ.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS